## క్లుప్తంగా

### క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాపిత బ్రహ్మకుమారీల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి మండిపల్లి

**రాయచోటి (జగదాంబసెంటర్) :** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణం ఎస్ఎన్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 2025 ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారీల క్యాలెండర్‌లను బుధవారం రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి ఆరతి బెహన్జీ, నాగముని, మహబూబ్‌బాషా, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### రాయుడుకాలనీలో వాలీబాల్ కోర్ట్ ప్రారంభం



కోర్ట్‌ను ప్రారంభిస్తున్న మడితాటి

**రాయచోటి (జగదాంబసెంటర్) :** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణం రాయుడు కాలనీలో వాలీబాల్ కోర్ట్‌ను బుధవారం పారిశ్రామికవేత్త మడితాటి శ్రీనివాసులురెడ్డి( కోడి శ్రీను) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాలన్న ధ్యేయంగా క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసేందుకు తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

### ప్రార్థనా మందిరంలో వేడుకలు



కేక్‌ను కట్ చేస్తున్న పాస్టర్, సంఘు సభ్యులు

**సుండుపల్లె :** పింఛాలోని బెరాక ప్రార్థనా మందిరంలో పాస్టర్ నిరంజన్, సంఘం సభ్యులు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ నిరంజన్ మాట్లాడుతూ యేసుక్రీస్తు మానవాళిని రక్షించడానికి ఈ లోకానికి వచ్చాడని, అందువలన డిసెంబర్ 25వ తేదీన పుట్టినరోజు జరుపుకున్నామని, అలాగే బుధవారం ఏసుక్రీస్తుకు నామకరణం చేసి ప్రార్థించడం జరిగిందన్నారు.

# కొత్త ఆశలతో.. సరికొత్త ఆకాంక్షలతో..

- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- కొత్త ఏడాదిలో విఘ్నాలు లేకుండా చూడాలంటూ ప్రత్యేక పూజలు
- జాతరను తలపించిన తిరుమలరాయి గుట్ట



రాజంపేట టౌన్: అలంకరణలో వరసిద్ధి వినాయకుడు



సంబేపల్లె: జాతర తలపించేలా భక్తులతో కిక్కిరిసిన తిరుమలరాయి గుట్ట

**రాజంపేట టౌన్ :** కొత్త ఏడాది రోజున అందరిలోను ఉత్సాహం ఉరకలేసింది. అంతా మంచే జరుగుతుందన్న కొంగొత్త ఆశలు అందరిలోను కనిపించి వారిలో ఆనందం తొణికిసలాడింది. గత ఏడాది చోటు చేసుకున్న బాధలు, విషాద సంఘటనలను మరచిపోయి, అందరు ఆనందంగా గడిపారు. ఏడాదంతా ఆనందంగా సాగిపోవాలన్న ఆశతో ప్రజలు బుధవారం ఆలయాలకు తరలి వచ్చి పూజలు చేశారు. ప్రధానంగా కసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డినగర్‌లో వెలసి ప్రసిద్ధిగాంచిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు.

**కోడూరులో..**

**రైల్వేకోడూరు అర్బన్ :** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. బుధవారం పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అలాగే భుజంగేశ్వర స్వామి దేవస్థానం, అమ్మవారిశాల, కోదండ రామాలయం, సాయిబాబా ఆలయం, అయ్యప్ప ఆలయం, రాఘవేంద్రస్వామి ఆలయాలతోపాటు తదితర ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

**భక్తులతో పోటెత్తిన తిరుమలరాయి గుట్ట**

**సంబేపల్లె :** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలోని తిరుమలరాయి గుట్టకు బుధవారం భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు తిరుమలేశుని దర్శించుకునేందుకు రావడంతో గుట్టపై సందడి కనిపించింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించి నూతన సంవత్సరంలో తమకు శుభాలు ప్రసాదించమని వేడుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల స్వామివారికి టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అలానే మండలంలోని మోటకట్ల వెంకటశివసాయి ఆలయం, సంబేపల్లె శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం, గుట్టపల్లె, పాలబండ వీరాంజనేయ స్వామి ఆలయాలల్లో భక్తులు ప్రత్యేక పూజలు గావించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా ఆలయాల్లో చెక్కభజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

**అలరించిన కోలాట ప్రదర్శన**

**ఒంటిమిట్ట :** శ్రీ కోదండరామస్వామి దర్శనార్థం బుధవారం భక్తులు బారులుతీరారు. వేల సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా తోకటపల్లికి చెందిన ముత్తుశెట్టి జనార్దన్ భజన బృందం చేసిన కోలాట ప్రదర్శన అలరించింది.



సంబేపల్లె: భక్తులకు దర్శనమిస్తున్న తిరుమలేశుడు



ఒంటిమిట్ట: కోలాట ప్రదర్శన చేస్తున్న కళాకారులు



రైల్వేకోడూరు అర్బన్: పూజల్లో పాల్గొన్న భక్తులు



సంబేపల్లె: మొక్కులు తీర్చుకొంటున్న భక్తులు

## ఘనంగా ఓబులేసు కల్యాణోత్సవం



కల్యాణ క్రతువు జరుపుతున్న వేదపండితులు



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

**లక్కిరెడ్డిపల్లి :** మండలంలోని బి.ఎర్రగుడి గ్రామంలో శ్రీ ఓబులేశ్వరస్వామి కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం సన్నిధిలో ఓబులేసు స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పెద్దిరెడ్డి రఘురామిరెడ్డి, బండ్రెడ్డి, ఓబుల్ సుబ్బారెడ్డి, బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి, సునీల్ కుమార్ రెడ్డిల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## పాపపు జీవితాన్ని వీడాలి

**ఓబులవారిపల్లె :** నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగంపేట మన్నా చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పాస్టర్ బర్నబాస్ మాట్లాడుతూ క్రీస్తు నందు సంఘం ఎదిగే విధంగా ప్రతి ఒక్కరి నడవడికలు ఉండాలన్నారు. పాపపు జీవితాలను విడిచిపెట్టాలని సూచించారు. అలానే మండల కేంద్రంలోని ప్రార్థన ఆలయం ముందు ప్రత్యేక ప్రార్థన నిర్వహించి బాణసంచా పేల్చారు. కాగా మరో కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులకు మండల వైయస్సార్ పార్టీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తల్లెం భరత్కుమార్‌రెడ్డి, గల్లా శ్రీనివాసులు, ప్రతాప్ పాల్గొన్నారు.

# సెలవు దినాల్లో స్టడీ అవర్స్ సరికాదు



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న పీఎస్‌టీయూ నేతలు

**రాయచోటి టౌన్ :** సెలవు దినాలలో వంద రోజుల ప్రణాళిక పేరిట విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించడం సబబు కాదని పీఎస్‌టీయూ రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ సయ్యద్ మజహరుల్ హక్ డీఈఓకు తెలిపారు. బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఈఓ శివప్రకాష్‌రెడ్డిలను కలసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఇలా స్టడీ అవర్స్ నిర్వహించడం వలన ఉపాధ్యాయులపైనే కాకుండా విద్యార్థులపై ప్రభావం చూపుతుందన్నారు. దీంతో లక్ష్య సాధనపై ప్రభావం పడుతుందన్నారు. కావున ఈ నిర్ణయంపై ఆలోచించి ఉపసంహరించుకోవాలని కోరారు.

# మంచి వ్యవస్థ కోసం కృషి చేద్దాం



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి కృష్ణన్‌కుట్టి

**రాయచోటి అర్బన్ :** మెరుగైన సమాజాన్ని నిర్మించే బాధ్యత న్యాయవాదులదే అని రాయచోటి 5వ అదనపు జిల్లాజడ్జి కృష్ణన్‌కుట్టి పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా తన నివాసంలో ఏర్పాటు చేసిన న్యాయవాదుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో న్యాయవాదులైన మహాత్మా గాంధీ, డా.రాజేంద్రప్రసాద్ లాంటి మేధావులు ప్రధాన భూమిక పోషించారన్నారు. స్వాతంత్ర్యానంతరం కూడా ఒక మంచి వ్యవస్థను నిర్మించడానికి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, ఎన్.గోపాలస్వామి అయ్యంగార్, మున్షిడికైతాన్‌లు న్యాయవాదులే అన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని న్యాయవాదులంతా కూడా మంచి వ్యవస్థను నిర్మించడానికి, అందరి హక్కులను గౌరవించే విధంగా ఉండేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి నాగముని, భారత న్యాయవాదుల సంఘం నేతలు టి.ఈశ్వర్, రాజకుమార్, ధనుంజయ కుమార్, ఆనందర్‌కుమార్, చిన్నయ్య, రవిశంకర్, ఖాదర్‌బాషా, నిరంజన్, కుసుమ, వరలక్ష్మి, సయ్యద్, దేవేందర్‌రెడ్డి, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జీవితాల్లో సంతోషాలు వెల్లివిరియాలి

**రామాపురం :** నూతన ఏడాదిలో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డిలు ఆకాంక్షించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ఉద్యోగులు పెద్దఎత్తున వారి స్వగ్రామం రామాపురం మండలం సుద్దమళ్ల గ్రామం యర్రమరెడ్డిగారిపల్లెలోని నివాసంలో శ్రీకాంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డిలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, అన్ని వర్గాల ప్రజలు శ్రీకాంత్‌రెడ్డిని అర్ధరాత్రి నుంచి కలుస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది తీపి, చేదు సంఘటనలను జ్ఞాపకాలుగా పెట్టుకుని కొత్త ఆశలతో నూతన ఏడాదిలో అభివృద్ధి వైపు సాగుదామని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పలు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల క్యాలెండర్లు, డైరీలను శ్రీకాంత్‌రెడ్డి ఆవిష్కరింపజేశారు.

**ప్రజల మోముల్లో చిరునవ్వులు నింపాలి**

**రాజంపేట టౌన్ :** నూతన ఏడాది ప్రజల మోముల్లో చిరునవ్వులు నింపాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని ఆకేపాటి ఎస్టేట్‌లో బుధవారం ఆకేపాటి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అధికారులు పెద్దఎత్తున తరలివచ్చి ఆకేపాటికి న్యూ ఇయర్ విషెస్ తెలియజేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాదిలో సంవృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలను ఇవ్వాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం కొత్త ఏడాదిలో అయినా కళ్లు తెరచి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పథకాలను అమలు చేయాలన్నారు. శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే విందు భోజనం ఏర్పాటు చేశారు. ఆకేపాటికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డిల ఉన్నారు.



రాజంపేట టౌన్: ఆకేపాటికి శుభాకాంక్షలు తెలిపి సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు



రామాపురం: మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు, కార్యకర్తలు



రైల్వేకోడూరు అర్బన్: కొరముట్ల శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

**కొరముట్లకు కార్యకర్తల శుభాకాంక్షలు**

**రైల్వేకోడూరు అర్బన్:** వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుకు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి పూలమాలలతో సత్కరించారు. రైతులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, శ్రామికులు, వ్యాపారస్తులకు ఈ ఏడాది మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, తోట శివసాయి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, జెడ్పీటీసీ రత్నమ్మ, ఆర్వీరమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

**ఎంపీపీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు**

**నందలూరు :** మండల పరిషత్ అధ్యక్షులు మేడా విజయ్‌భాస్కర్ రెడ్డి స్వగృహంలో బుధవారం మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా శాలువా, పూలమాల, బొకేలతో ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మేలు జరగాలని, ఈ ఆంగ్ల నూతన సంవత్సరం అందరి జీవితాలలో వెలుగును నింపాలని, అష్ట ఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో ప్రజానీకం వర్ధిల్లాలన్నారు.

**నూతన ఏడాదిలో ప్రజలందరూ బాగుండాలి**

**లక్కిరెడ్డిపల్లి :** నూతన ఏడాదిలో ప్రజలందరూ బాగుండాలని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా రామాపురం మండలంలోని యర్రంరెడ్డిగారిపల్లిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డిలు కలసి కేక్ కట్ చేసి వారిని గజమాలతో సత్కరించారు. అనంతరం లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ నివాసంలో ఎంపీడీఓ రెడ్డయ్యతోపాటు అధికారులు, నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. తదుపరి సదుం యర్రాతివారిపల్లిలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

**పోలా కార్యాలయంలో అభిమానుల సందడి**

**రాజంపేట టౌన్ :** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ఆయన అభిమానులు పెద్దఎత్తున తరలి వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దీంతో కాకతీయ కళాశాల ప్రాంగణంలోని ఛైర్మన్ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది.

**జెడ్పీ మాజీ వైస్ ఛైర్మన్‌కు శుభాకాంక్షలు**

**చిన్నమండెం :** జెడ్పీ మాజీ వైస్ ఛైర్మన్, చిన్నమండెం మండల వైఎస్ఆర్‌సీపీ నాయకులు దేవనాథరెడ్డి, ఎంపీపీ సుధామాధురిలకు పలువురు కార్యకర్తలు, నాయకులు బుధవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ శ్యాంచంద్ర, కోఆప్షన్ మెంబర్ గౌస్‌సాబ్, ఉపసర్పంచులు పెద్దరెడ్డప్పరెడ్డి, సుదర్శన్‌బాబు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు దేవేంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, జయశంకర్‌రెడ్డి, చిన్నరెడ్డి, రమణ, సుధాకర్, భాస్కర్, నాగరాజ, రవిశంకర్, ఆంజనేయులు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

**కొండూరులో అట్టహాసంగా..**

**పెనగలూరు :** రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ ఛైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, రాజంపేట మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మ, మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డిల స్వగ్రామమైన కొండూరులో నూతన సంవత్సర వేడుకలు అట్టహాసంగా జరిగాయి. మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు భారీసంఖ్యలో పాల్గొని కొండూరు కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి భారీ కేక్‌ను కట్ చేశారు.

**వీరబల్లి :** మండలంలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి నివాసంలో కేక్ కట్ చేసి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మను మర్యాదపూర్వకంగా కలిసిన కొరముట్ల**

**పెనగలూరు :** రాజంపేట మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మను, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ ఛైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, విజయ్ రెడ్డిలను బుధవారం రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ముగ్గురిని శాలువాలతో సత్కరించి పూలబొకేలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో శివారెడ్డి పాల్గొన్నారు.



వీరబల్లిలో..



రాజంపేట టౌన్: పోలా శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



నందలూరు: ఎంపీపీ మేడాకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



లక్కిరెడ్డిపల్లి: మాజీ మంత్రి పెద్దిరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మద్దిరేవుల



పెనగలూరు: పార్టీ శ్రేణులతో కలసి కేక్ కట్ చేస్తున్న కొండూరు కుటుంబసభ్యులు



పెనగలూరు: మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మ, అజయ్ రెడ్డిలను కలిసిన కొరముట్ల



చిన్నమండెం: దేవనాథరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

## రాములోరి భక్తుల అవస్థలు



భోజనాల కోసం అన్నప్రసాద కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న భక్తులు

**ఒంటిమిట్ట :** ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయం ఎదురుగా ఉన్న టీటీడీ అన్నప్రసాద కేంద్రం వద్ద భక్తులు అన్నప్రసాదం కోసం నిరీక్షించారు. బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా ఒంటిమిట్ట రామాలయానికి భక్తులు వేల సంఖ్యలో పోటెత్తారు. అయితే ప్రతి ఏటా నూతన సంవత్సర రోజు ఒంటిమిట్ట రామాలయానికి భక్తులు తాకిడి వేల సంఖ్యలోనే ఉంటుంది. ఇది తెలిసినా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు రద్దీగా ఉన్నచోట కనీసం క్యూలైన్ల ఏర్పాట్లు కూడా చేయకుండా, అన్నదానానికి కనీస వసతులు కల్పించలేదు. వేలమంది వచ్చినా కనీసం 50 మంది కూడా కూర్చొని తినలేని అన్నప్రసాద కేంద్రానికి అధికారులు భక్తులను పంపుతున్నారు. దీనిపై భక్తులు తిరుమల తిరుపతి దేవస్థానం వారు జన సామర్థ్యం లేని అన్న ప్రసాద కేంద్రంలో భోజనాలు పెట్టడం కన్నా, బహిరంగ ప్రదేశంలో చలువ పందిళ్లు వేసి, క్యూ లైన్ ఏర్పాటు చేసి సౌకర్యవంతంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వ హించి ఉంటే సరిపోయేదని, ఇలా భక్తులను అన్నప్రసాదం కోసం నిరీక్షింప చేయడంపై భక్తు లు టీటీడీ అధికారులపై పెదవి విరుస్తున్నారు. ఇక ముక్కోటి ఏకాదశికి భక్తుల తాకిడి నూతన సంవత్సరాని కంటే మరీ ఎక్కువగా ఉంటుంది. మరి అప్పుడు టీటీడీ అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేస్తారో వేచి చూడాలి.



నైవేద్య ప్రసాద పంపిణీ కేంద్రం వద్ద కనీస ఏర్పాట్లు చేయని టీటీడీ అధికారులు